నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, మంగళవారం 20 మే 2025 HYDERABAD




## వర్షసూచన

సిటీబ్యూరో, మే 19 (నమస్తే తెలంగాణ): రుతుపవనాల ఆగమనానికి తోడు బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలిక పాటి నుంచి మోస్తరు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. సోమవారం గరిష్ఠం 35.2, కనిష్ఠం 26.7 డిగ్రీలు, గాలిలో తేమ 49 శాతంగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.



శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో 90 రోజుల పాటు నిర్వహించిన డేటా ఇంజినీరింగ్ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. నాలెడ్జ్ సిటీలోని టీ-హబ్‌లో జరిగిన ముగింపు వేడుకలకు తెలంగాణ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) సీఈవో శ్రీకాంత్ సిన్హాలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న 80 మంది నిరుపేద గ్రాడ్యుయేట్లకు ధ్రువీకరణపత్రాలు, 22 మంది విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. -కొండాపూర్, మే 19

# కట్టిన ఇంటికి సున్నం వేసినట్లు

## శిల్పా లే అవుట్ ఫేజ్- 2 ఫ్లై ఓవర్‌పై కాంగ్రెస్ ప్రగల్భాలు

### నిధులిచ్చి 70% పూర్తి చేసిన బీఆర్‌ఎస్
### మిగిలిన 30 % నిర్మాణానికి
### 16 నెలలు సాగదీసిన కాంగ్రెస్
### తామే పూర్తి చేశామంటూ అబద్ధపు ప్రచారం
### ఐటీ ఉద్యోగుల విస్మయం

సిటీబ్యూరో, శేరిలింగంపల్లి, కొండాపూర్ మే 19 : సొమ్ము ఒకరిది సోకు మరొకరిది అన్న చందంగా మారింది ప్రజా పాలన ప్రభుత్వ పనితీరు...తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి..కాగితాల్లోనే ప్రాజెక్టుల పేర్లు మార్చారే తప్ప చెక్కు చెదరని నిర్మాణాలపై కేసీఆర్ వేసిన ముద్రను చెరపడం సాధ్యపడడం లేదు..సచివాలయం, అంబేద్కర్ భారీ విగ్రహం ఇలా ఒక్కటేమిటీ తాజాగా ఎస్‌ఆర్‌డీపీ ఫలాలను సైతం తమ ఖాతాల్లోకి వేసుకుంటూ వస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం.

#### సిగ్నల్ రహిత ప్రయాణమే లక్ష్యంగా..

కేసీఆర్ ప్రభుత్వం సిగ్నల్ రహిత ప్రయాణమే లక్ష్యంగా రూ.5112.36 కోట్ల అంచనా వ్యయంతో 47 ప్రాజెక్టులు చేపట్టగా, 36 ప్రాజెక్టులను అనతికాలంలోనే పూర్తి చేసి.. వాటి ఫలాలను నగర పౌరులకు అందజేసింది. 16 నెలల కాంగ్రెస్ పాలనలో పురోగతిలో తుది దశలో ఉన్న ఫ్లై ఓవర్లను అందుబాటులోకి తెచ్చి..తామే తీసుకువచ్చామని గొప్పలు చెప్పుకుంటూ వస్తున్నది. ఇప్పుడు ఈ గొప్పల జాబితాలో శిల్పా లే అవుట్ ఫేజ్-2ను చేర్చింది. దాదాపు 70 శాతం బీఆర్‌ఎస్ హయాంలో పూర్తి చేసుకున్న ప్రాజెక్టును నెలల వ్యవధిలోనే పూర్తి చేయాల్సిన ప్రాజెక్టును ఏడాదిన్నర సమయం తీసుకుని అటు వాహనదారులను, ఇటు స్థానికులను ముప్పు తిప్పలు పెట్టడమే కాకుండా ప్రాజెక్టు నిర్మాణ మొత్తాన్ని 16 నెలల్లోనే పూర్తి చేశామంటూ సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేసుకుంటున్నది. ప్రాజెక్టు మొత్తాన్ని గడిచిన 16 నెలల్లో శిల్పా లే అవుట్ నిర్మాణ పనులను పూర్తి చేసినట్లు సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తుండడంపై ఐటీ ఉద్యోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని కప్పిపుచ్చుతూ మేమే చేశామంటూ ప్రగల్భాలు పలుకుతూ వాస్తవాలు దాచే ప్రయత్నం చేస్తుందని మరికొందరు నెటిజన్లు మండిపడ్డారు. వాస్తవంగా 1.1 కిలోమీటర్ల మేరలో రూ.446.13కోట్ల అంచనాతో చేపడుతున్న ఈ ప్రాజెక్టుకు తొలుత 23 మే 2018లోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.330 కోట్ల అంచనాతో పరిపాలన అనుమతులు ఇచ్చి పనులకు శ్రీకారం చుట్టడం గమనార్హం. సవాల్‌గా మారిన భూ సేకరణను సమర్థవంతంగా పూర్తి చేసి పనుల్లో వేగం పెంచింది. మిగతా IVవ పేజీలో



మరికొద్దిరోజుల్లో ప్రారంభానికి సిద్ధమైన శిల్పాలే అవుట్ ఫేజ్-2 ఫ్లైఓవర్

# రద్దు చేసి ఆపై నిందలా?

## పట్టాలెక్కిన ఎయిర్‌పోర్టు మెట్రోను రద్దు చేసిన రేవంత్ సర్కార్

### ఆ అంశాన్ని మరిచి గత ప్రభుత్వంలో మెట్రో పనులే జరగలేవన్న ఎన్వీఎస్ రెడ్డి
### కేసీఆర్ హయాంలో చేసిన వ్యాఖ్యల్ని గుర్తు చేస్తూ నెటిజన్ల ఫైర్

సిటీబ్యూరో, మే 19 (నమస్తే తెలంగాణ): ఎయిర్‌పోర్ట్ మెట్రో.. కేసీఆర్ ప్రభుత్వం సాంకేతికంగా కొలిక్కి తెచ్చి రూ.6,250 కోట్లతో శంకుస్థాపన చేసి పట్టాలెక్కించిన కీలకమైన మెట్రో ప్రాజెక్టు. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చీరాగానే రద్దు చేసింది. ఈ రెండింటికీ ప్రత్యక్ష సాక్షి హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి. కాంగ్రెస్ సర్కారు ఆ ప్రాజెక్టును కొనసాగించి ఉంటే చివరి దశలోకి వచ్చి రేపో మాపో అందుబాటులోకి వచ్చేది. హైదరాబాద్ మెట్రో విస్తరణ అనేది మరో 31 కిలోమీటర్లు పెరిగేది. కానీ ఎన్వీఎస్‌రెడ్డి ఈ వాస్తవాన్ని విస్మరించారు... పదేండ్ల కాలంలో ఏమీ జరగలేదంటున్నారు. అదే సమయంలో ఏడాదిన్నరగా హైదరాబాద్ నగరంలో ఒక్కటంటే ఒక్క కొత్త అభివృద్ధి పనుల్లో తట్టెడు పని చేయకుండా... అందునా ఏడాది కిందట మెట్రో ప్రాజెక్టుకు శిలాఫలకం వేసి నేటికీ కనీసం డీపీఆర్ పూర్తి చేయని కాంగ్రెస్ ప్రభుత్వం మెట్రో ప్రాజెక్టును ఏదో పరుగులు పెట్టిస్తుందనే రీతిలో వ్యాఖ్యానించడం చర్చనీయాంశంగా మారింది. ఎండీ వ్యాఖ్యలు ఏ ఎండకు ఆ గొడుగు పట్టే రీతిలో ఉన్నాయంటూ సోషల్ మీడియాలో నెటిజన్లు ఫైర్ అవుతున్నారు. అంతేకాదు... కేసీఆర్ హయాంలో ఇదే ఎన్వీఎస్‌రెడ్డి వ్యాఖ్యల వీడియోను జత చేసి ఆయన ద్వంద్వ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

#### తప్పుపట్టిన నెటిజన్లు

మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి ఇటీవల ఒక చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పదేండ్ల కాలంలో మెట్రో రైలు ప్రాజెక్టులకు సంబంధించి కేవలం ప్రతిపాదనలేగానీ పనులు మాత్రం జరగలేదని వ్యాఖ్యానించారు. దీంతో సోషల్ మీడియాలో ఈ వీడియోను పోస్టు చేసిన నెటిజన్లు ఆయన తీరును తప్పుబట్టారు. వాస్తవానికి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఒకవైపు వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్‌ఆర్‌డీపీ) కింద భారీ ఎత్తున ఫ్లైఓవర్లు, ఇతరత్రా నిర్మాణాలను పూర్తి చేస్తూనే ఇంకోవైపు బృహత్తర మెట్రో ప్రాజెక్టుల్ని కూడా ముందుకు తీసుకుపోయేందుకు తీవ్రస్థాయిలో కృషి చేశారు. కానీ బెంగళూరు, ఇతర మెట్రో నగరాలకు సహకారం అందించిన కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కించిత్తు సాయం కూడా చేయలేదు. అయినప్పటికీ కేంద్రంపై ఆధారపడకుండా మెట్రో ప్రాజెక్టుల్ని మిగతా IIవ పేజీలో



2022, డిసెంబర్ 9న ఎయిర్‌పోర్టు మెట్రో పనులకు శంకుస్థాపన చేసిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్(ఫైల్)

# ఎలివేటెడ్ పనులెప్పుడు?

### కొలిక్కిరాని భూసేకరణ ప్రక్రియ



మేడ్చల్, మే 19(నమస్తే తెలంగాణ): ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట రింగ్ రోడ్డు వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి ఇప్పట్లో పనులు ప్రారంభం కష్టంగానే కనిపిస్తున్నది. ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట రింగ్ రోడ్డు వరకు 18 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి భూ సేకరణ ప్రక్రియ ఇంకా కొలిక్కి రావడం లేదు. భూ సేకరణ పూర్తయ్యేదెప్పుడు పనులు ప్రారంభయ్యేదెప్పుడు అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని శామీర్‌పేట రింగ్‌రోడ్డు నుంచి 12 కిలోమీటర్లు కాగా హైదరాబాద్ జిల్లాలోని లోతుకుంట నుంచి ప్యారడైజ్ వరకు 6 కిలో మీటర్లు ఉండగా భూ సేకరణకు సంబందించి నిర్వహిస్తున్న గ్రామ సభల్లో రోడ్డు విస్తరణతో ఆస్తులు కోల్పోతున్న వారు కొందరు న్యాయ స్థానాలను ఆశ్రయించారు. దీంతో భూ సేకరణ ప్రక్రియ ముందుకెళ్లడం లేదు. ఈ నేపథ్యంలో ఎలివేటెడ్ కారిడార్ పనులు ప్రారంభంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

#### 200 ఫీట్ల విస్తరణ అవసరం లేదు..

ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి 200 ఫీట్ల విస్తరణ అవసరం లేదని, వంద ఫీట్ల విస్తరణతో ఎలాంటి ఆస్తులు కోల్పోయే అవసరం రానందున వంద ఫీట్ల రోడ్డు విస్తరణనే చేయాలని ఆస్తులు కోల్పోతున్న బాధితులు గ్రామ సభల్లో ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు. ఒక వేళ తమ భూములు తీసుకుంటే బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధర ప్రకారం తమకు నష్టపరిహారం చెల్లిస్తే తమ భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటిస్తున్నారు. అయితే ఈ డిమాండ్లను ప్రభుత్వానికి విన్నవిస్తామని అధికారులు చెబుతున్నా.. ఇప్పటి వరకు భూ సేకరణ ప్రక్రియపై సర్కారు ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం వెల్లడించలేదని నిర్వాసితులు పేర్కొంటున్నారు. అయితే ఇప్పట్లో భూ సేకరణ ప్రక్రియ తేలేలా కనిపించడం లేదని తెలుస్తున్నది.

# నిమ్స్‌లో సేవల విస్తరణ

### జూన్ 1 నుంచి వాస్క్యులర్ ఓపీ




సిటీబ్యూరో, మే 19 (నమస్తే తెలంగాణ): రోగుల రద్దీని దృష్టిలో పెట్టుకుని నిమ్స్‌లో వివిధ విభాగాల ఓపీ సేవలను మరింత విస్తరించేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో వారంలో మూడు రోజులు ఉన్న ఓపీ పనిదినాలను అన్ని పనిదినాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగానే వాస్క్యులర్ విభాగం ఓపీని ఇక నుంచి అన్ని పనిదినాల్లో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప వెల్లడించారు. ఈ విభాగానికి సంబంధించి ప్రస్తుతం వారంలో మూడు రోజులు మాత్రమే ఓపీ సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి ఓపీ రోజున సుమారు 300 నుంచి 400 వరకు రోగులు వస్తుంటారు. దీని వల్ల అటు వైద్య సిబ్బందిపై ఒత్తిడి పెరగడమే కాకుండా రోగులకు సైతం నిరీక్షణ తప్పడం లేదు. దీనిని దృష్టిలో పెట్టుకుని రోగుల సౌకర్యార్థం వాస్క్యులర్ ఓపీని అన్ని పనిదినాల్లో అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసినట్లు డైరెక్టర్ డాక్టర్ బీరప్ప తెలిపారు. జూన్ 1 నుంచి ఇది అమల్లోకి వస్తుందన్నారు. కాగా, పిడియాట్రిక్ భవనంలో ఇప్పటికే పిడియాట్రిక్ రుమటాలజీ(ఎస్ఎల్ఈ), అంకాలజీ విభాగంలో హెడ్ అండ్ నెక్ క్లినిక్‌ను ప్రారంభించినట్లు వివరించారు. నిమ్స్‌కు నాలుగు కొత్త విభాగాలు మంజూరైనట్లు డైరెక్టర్ డాక్టర్ బీరప్ప వెల్లడించారు. క్రిటికల్ కేర్ విభాగంలో నాలుగు డీఎం సీట్లు, న్యూరో అనస్తీషియా విభాగంలో నాలుగు డీఎం సీట్లు మంజూరు కావడంతో క్రిటికల్ కేర్, న్యూరో అనస్తీషియా విభాగాలను కొత్తగా ప్రారంభించినట్లు వివరించారు. దీంతో పాటు ఫెల్లోషిప్ కోర్సులు సైతం ప్రారంభమైనట్లు తెలిపారు.

# రక్షణ గోడ లేకుండా సెల్లార్ తవ్వద్దు

### వర్షాకాలం నేపథ్యంలో టౌన్ ప్లానింగ్ స్పెషల్ డ్రైవ్

సిటీబ్యూరో, మే 19 (నమస్తే తెలంగాణ): వర్షాకాలం ముందస్తు చర్యలపై జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అప్రమత్తమైంది. కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశాల మేరకు సెల్లార్, శిథిల భవనాల ప్రమాదాల నివారణే లక్ష్యంగా సర్కిళ్ల వారీగా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని సీసీపీ కె. శ్రీనివాస్ జోనల్ ఏసీపీలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయా జోనల్ ఏసీపీ నిర్మాణ దశలో ఉన్న కన్‌స్ట్రక్షన్స్‌పై క్షేత్రస్థాయి తనిఖీలు చేపడుతున్నారు. నిబంధనల ప్రకారం ప్రతి ఒక్క నిర్మాణదారు సెల్లార్ దశలో రక్షణ గోడ నిర్మించాలి. చాలా మంది సెల్లార్ తవ్వకాలపై నిబంధనలు ఉల్లంఘించి ఎడపెడా పనులు జరపడం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల కాలంలో శేరిలింగంపల్లి సిద్దిఖ్‌నగర్‌లో ఓ భవనం నేలకు ఒరిగింది. ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదు. వెంటనే అధికారులు సంబంధిత భవనాన్ని పూర్తిగా నేలమట్టం చేశారు. ఎల్బీనగర్‌లో సెల్లార్ తవ్వకాల సందర్భంగా మట్టిదిబ్బలు కూలి కార్మికులు చనిపోయిన సందర్భాలు ఉన్నాయి. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని వర్షాకాలంలో ప్రమాదాలకు తావివ్వకుండా సంబంధిత నిర్మాణదారులను గుర్తించి అప్రమత్తం చేసేందుకు ఏసీపీ క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. నిబంధనలు పాటించని వారికి నోటీసులు జారీ చేయనున్నారు. వర్షాకాలం ప్రారంభం నాటికల్లా తవ్వి ఉంటే అక్కడ అన్ని జాగ్రత్త చర్యలు పాటించాలి. సాయిల్ బలోపేతం, రిటైనింగ్ వాల్, బారికేడింగ్ తదితర చర్యలు తీసుకోవాలని సూచించనున్నారు. చుట్టుపక్కల భవనాలకు ప్రమాదం జరగకుండా జాగ్రత్త చర్యలు పాటించాలి. ప్రమాదానికి ఆస్కారం ఉంటే వెంటనే సీ అండ్ డీ విభాగం సహకారంతో సెల్లార్‌ను మూసివేయాలి. వర్షాకాలంలో అక్రమంగా ఎవరైనా సెల్లార్ తవ్వితే వెంటనే చట్ట ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకునేలా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వీటికి తోడు శిథిల భవనాల గుర్తింపునకు సర్వే చేపడుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

# ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

ఖైరతాబాద్, మే 19 : ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ జరుగుతున్నదని, నియంత్రణా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. ఎంవీ ఫౌండేషన్, టీచర్స్ ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్, చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం సంయుక్తాధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అధిక ఫీజుల నియంత్రణపై రౌండ్ టేబుల్ సమావేశంలో జరిగింది. ఎంవీ ఫౌండేషన్ చీఫ్ కోఆర్డినేటర్ వై. రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణలో ఇబ్బడిముబ్బడిగా పుట్టుకొచ్చిన ప్రైవేట్ విద్యాసంస్థలు అడ్డూ అదుపు లేకుండా ఫీజుల భారాన్ని తల్లిదండ్రులపై వేస్తోందన్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రాష్ట్రంలో విద్యావ్యవస్థ వ్యాపారంగా మారిపోయిందన్నారు. రాష్ట్రంలో 36 లక్షల మంది విద్యార్థులు వివిధ పాఠశాలల్లో చదువుకుంటున్నారని, తల్లిదండ్రుల ఫీజుల భారం వర్ణణాతీతమన్నారు. చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం కన్వీనర్ జి. వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థుల నుంచి ఫీజులే కాకుండా బలవంతంగా యూనిఫాం, బూట్లు, నోట్‌పుస్తకాలు, టై, బ్యాడ్జీలు, స్పోర్ట్స్ డ్రస్ అంటూ మరింత దోచుకుంటున్నారన్నారు. హైదరాబాద్ స్కూల్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటసాయినాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏటా దాదాపు రూ.20వేల కోట్లనుంచి రూ.30వేల కోట్ల విద్యావ్యాపారం సాగుతుందన్నారు. మథర్స్ అసోసియేషన్ కన్వీనర్ జి. భాగ్యలక్ష్మి, నెట్‌వర్క్ ప్రొటెక్షన్ ఫర్ చైల్డ్ రైట్స్ కోఆర్డినేటర్ ఎస్. నాగరాజు, టీచర్స్ ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ కన్వీనర్ జనార్దన్ పాల్గొన్నారు.

# మంటలు ఆర్పడంలో ఆలస్యమైందా?

## వసతులు సరిగా లేవనే విమర్శలు

### అగ్నిమాపక వాహనాల్లో నీటిని నింపడంలో ఆలస్యమనే ఆరోపణలు
### గుల్జార్‌హౌస్ ఘటనపై భిన్నాభిప్రాయాలు
### రోబోను తెచ్చినా.. అవసరం రాలే..
### పొగతోనే భారీ ప్రాణ నష్టం జరిగిందా..?



సోమవారం గుల్జార్‌హౌస్ అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించిన మాజీ మంత్రులు కేటీఆర్ , తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

**సిటీబ్యూరో, మే 19 (నమస్తే తెలంగాణ)/చార్మినార్:** గుల్జార్ హౌస్‌లో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో ఫైర్ సిబ్బందికి సరైన వసతులు లేకపోవడంతో వేగంగా మంటలు ఆర్పేందుకు లోపలికి వెళ్లలేకపోయారనే విమర్శలు వస్తున్నాయి. ఘటనా స్థలికి వెళ్లేందుకు మెట్లు చిన్నగా ఉండడం, వెళ్లడానికి ఫైర్ సిబ్బంది ఇతర ఏర్పాట్లు చేశారు. అలాగే ప్రధానంగా మంటలు, పొగ, ప్రమాదకరమైన గ్యాస్‌ల నుంచి రక్షణ పొందేందుకు ఉపయోగించే బ్రీతింగ్ మాస్క్‌లు సరిగ్గా లేకపోవడంతో ఘటనా స్థలికి వెళ్లిన సిబ్బంది కొద్దిసేపు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. వీటికి తోడు మంటలను ఆర్పేందుకు ఫైరింజన్లలో నీరు కూడా లేదనే ఆరోపణలు వచ్చాయి. ఇలాంటి కారణాలతో సహాయక చర్యల్లో ఆలస్యం జరిగిందనే విమర్శలు వస్తున్నాయి. అగ్నిప్రమాదం చిన్నదే అయినా పొగ ఎక్కువగా రావడంతోనే భారీగా ప్రాణ నష్టం జరిగింది.



#### నీటిని నింపడంలో ఆలస్యం.. ?

గుల్జార్ హౌస్‌లో 11 అగ్నిమాపక యంత్రాలు మంటలు ఆర్పేందుకు ఘటనాస్థలికి వచ్చాయి. అయితే ఇక్కడకు వచ్చిన అగ్నిమాపక వాహనాల్లో నీటిని నింపడంలో ఆలస్యం జరిగిందనే బాధిత కుటుంబాల నుంచి విమర్శలు వస్తున్నాయి. వేసవి కాలం కావడంతో నీటిని నింపుకోవడానికి ప్రయత్నించిన అగ్నిమాపక నియంత్రణ వాహనాల్లో అక్కడక్కడ నీటిని నింపేందుకు జలమండలి సిబ్బంది నిరాకరించారనే ఆరోపణలు వస్తున్నాయి.

#### రోబోను వాడాలనుకున్నారు..

గుల్జార్ హౌస్‌లో జరిగిన అగ్నిప్రమాదాన్ని నివారించేందుకు అగ్నిమాపక శాఖ అధికారులు రోబోను వాడాలనుకున్నారు. అయితే రోబోను వాడేంతగా ప్రమాద తీవ్రత లేదని గుర్తించి దానిని తిరిగి వెనక్కి పంపించారు. గుల్జార్ హౌస్ ప్రమాద ఘటనకు షార్ట్ సర్క్యూటే కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రమాదాన్ని గుర్తించేందుకు క్లూస్ టీమ్ ఘటన స్థలికి వెళ్లినా భవనం పూర్తిగా దెబ్బతినడంతో లోపలికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. విద్యుత్ వాడకం పరిమితికి మించి వాడుతున్న క్రమంలోనే షార్ట్ సర్క్యూట్ సంభవించి ఉంటుందని ఇప్పటకే అధికార యంత్రం ఒక నిర్ధారణకు వచ్చింది. అగ్నిమాపక శాఖ వద్ద సరిపోయినన్ని మాస్క్‌లున్నాయి.. సరిపోయినంత నీళ్లు ఉన్నాయి.. ప్రమాదాన్ని బట్టి ఉపయోగించేందుకు అన్ని సదుపాయాలు ఉన్నాయని సికింద్రాబాద్ డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ అఫీసర్ శ్రీదాస్ తెలిపారు. మంటల్లో చిక్కుకున్న వారిని మానవ సహాయం మిగతా IVవ పేజీలో

### అక్రమ కరెంటే కారణమా..?

ప్రహ్లాద్ ఇంటికి అక్రమ కరెంట్ కనెక్షన్ ఉన్నట్లు అగ్నిమాపక అధికారులు గుర్తించారు. నగల దుకాణం మూసేయగానే హైటెన్షన్ వైర్ నుంచి అక్రమంగా కరెంట్ తీసుకున్నట్లు చెబుతున్నారు. కొక్కేల ద్వారా కరెంట్ వైర్ వేసి హైటెన్షన్ వైర్ల నుంచి కరెంట్ తీసుకునే వారని దర్యాప్తులో ప్రాథమికంగా నిర్ధారించారు. పెద్ద మొత్తంలో లోడ్ పడడం వల్ల మీటర్ వద్ద కరెంట్ ఓల్టేజీలో హెచ్చుతగ్గులు వచ్చి మీటర్ బాక్స్‌లో మంటలు వచ్చాయి. మీటర్ బాక్స్ నుంచి పక్కనే ఉన్న చెక్క షో కేసుకు ముందుగా మంటలు అంటుకున్నట్లు తెలుస్తోంది. దీంతో మంటల వ్యాప్తి వేగంగా జరిగినట్లు వారు చెప్పారు. షార్ట్ సర్క్యూట్ ఈ ప్రమాదానికి కారణం కాదంటూ మెట్రో సీఈ చక్రపాణి తెలిపారు. కానీ ఓల్టేజీలో వచ్చిన మార్పులతో వచ్చిన స్పార్క్స్ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లుగా తెలుస్తోంది.

